క్లుప్తంగా

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న వైద్యాధికారి

ఇంద్రవెల్లి: సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కుడ్మేత మనోహర్ అన్నారు. గురువారం మండలంలోని హీరాపూర్ గ్రామంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం ఉత్సవాలు



నృత్యం చేస్తున్న యువకులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. గోండ్‌గూడ, భగత్ సింగ్‌నగర్, వాల్గొండ, కేస్లాపూర్, హర్కపూర్, అంజీ, వడగామ్, ముత్నూర్, ధనోర గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలను నిర్వహించారు. పీరీలు, డోలలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. యువకులు చేసిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది.

నార్నూర్: మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు కొనసాగుతున్నాయి. గురువారం నాన్ హైదర్ పీరులను మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీ, దుర్గానగర్, మైనార్టీ వార్డు, మార్కెట్ ప్రాంతంలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పీరీల పూజారులు ఎస్.కె షారుక్ బాబా, జైపాల్ జాడే, పవన్, మన్నన్, అంజాత్ ఖాన్ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: మహబూబ్‌నగర్ మార్కెట్ కార్యదర్శి భాస్కర్‌పై ఆ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దాడి చేయడాన్ని నిరసిస్తూ వ్యవసాయ మార్కెట్ ఉద్యోగుల సంఘం నాయకులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు సయ్యద్ ఆజమ్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి సమ్మేళనానికి తరలిరండి

కైలాస్‌నగర్: జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనానికి పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేసి, ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలి, అందుకోసం తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ శ్రేణులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిశా నిర్దేశం చేయనున్నట్లుగా పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు.

పిచ్చిమొక్కల తొలగింపు

బోథ్: మండల కేంద్రంలోని ఒకటో వార్డులో పిచ్చి మొక్కలు, ముళ్లపోదాలు ఏపుగా పెరగడంతో రాత్రుల్లో అడవి పందులు సంచరిస్తున్నాయి. ఈ విషయాన్ని కాలనీ యువకులు, పీఏసీఎస్ సొసైటీ డైరెక్టర్ చట్ల ఉమేష్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఉమేష్ జేసీబీ సాయంతో రోడ్డు పక్కన పెరిగిన ముళ్లపొదలను, పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించారు.

ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయండి

బోథ్: నూతనంగా ఏర్పడిన సొనాల మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ఇర్ల అభిలాష్ అన్నారు. గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి విన్నవించారు. హైదరాబాద్‌లో మంత్రి ఛాంబర్‌లో మంత్రిని కలిసి శాలువాతో సత్కరించారు. పోలీస్ స్టేషన్, మండల విద్యావనరుల కేంద్రం, వ్యవసాయ కార్యాలయంతో ఎంపీడీవో కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు.

కేజీబీవీలో సమస్యల తిష్ట

- ప్రహరీ లేక విద్యార్థినులకు కొరవడిన రక్షణ
- బురదమయంతో తంటాలు
- ఆదిలాబాద్‌రూరల్ కేజీబీవీ దుస్థితి



బురదమయంగా కేజీబీవీ ఆవరణ



బంగారుగూడ కస్తూరిబా విద్యాలయం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగారుగూడ కస్తూరిబా బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారు. బాలికల పాఠశాలకు కనీసం రక్షణ లేకుండా పోయింది. ప్రహరీ లేక పోవడంతో బయట వ్యక్తులు, పశువులు, విషసర్పాలు సంచరిస్తున్నాయి. అదే విధంగా చుట్టుపక్కల వారు పాఠశాల స్థలాన్ని కబ్జా చేసే ప్రమాదం లేక పోలేదు. పాఠశాలకు కేటాయించిన నాలుగు ఎకరాల భూమిలో కొంత భాగం ఆక్రమణకు గురవుతోంది. పట్టించుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

అన్నీ సమస్యలే..

జిల్లా కేంద్రంలోని బంగారుగూడ కేజీబీవీలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యాబోధన జరుగుతుంది. పాఠశాలలో 280 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. గతేడాది నుంచి కొత్తగా నిర్మించిన భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ ప్రహరీ నిర్మించకుండానే పాఠశాలను అప్పగించారు. దీంతో విద్యార్థులు పడుతున్న కష్టాలు అంత ఇంత కావు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పాఠశాల ఆవరణ బురదమయంగా మారింది. నడవడానికి కూడా వీలు లేకుండా పోయింది. పాఠశాల ఆవరణను చదును చేయకుండా అలాగే వదిలేయడంతో గుంతలమయంగా ఉన్న వాటిలో వర్షపు నీరు నిల్వ ఉంటుంది. దీంతో దోమలు, ఈగలకు నిలయంగా మారి వ్యాధులకు కారణమవుతోంది. తమ పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడ కేజీబీవీ ఆవరణలో నీరు నిల్వ ఉన్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. పాఠశాల నుంచి రోడ్డు వరకు రోడ్డు నిర్మించేలా అధికారులను ఆదేశించారు. ప్రహరీ మంజూరైంది. వర్షాలు కురుస్తుండడంతో పనులను ప్రారంభం కాలేదు.

– ఉదయశ్రీ, సెక్టోరియల్ అధికారి, ఆదిలాబాద్

అభివృద్ధి పనుల కోసం సర్వే



కొలతలు చేపడుతున్న అధికారులు

బోథ్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అభివృద్ధి పనుల కోసం గురువారం మార్కెటింగ్ శాఖ చీఫ్ ఇంజనీర్ గణేష్ తమ అధికార బృందంతో కలిసి యార్డును సందర్శించి, వివిధ ప్రాంతాల్లో కొలతలు చేపట్టి ప్రాథమిక సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్‌యార్డు వృద్ధి కోసం రూ.3 కోట్లు 72 లక్షల విలువైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ విఠల్, మండల వ్యవసాయాధికారి, తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించి.. మొక్కలు నాటి



మొక్కలు నాటిన ప్రాంతం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో కాలనీవాసులు రెగ్యులర్‌గా చెత్త పడేస్తున్న (గార్బేజ్ వల్నరేబుల్ పాయింట్)లను గుర్తించిన మున్సిపల్ అధికారులు వాటిని సరిదిద్దే చర్యలు చేపట్టారు. కలెక్టర్‌చౌక్‌లోని ఆదిలాబాద్ మండల పరిషత్ ఉద్యోగుల సముదాయ ప్రాంగణ ప్రహరీ, సంజయ్‌నగర్ సమీపంలోని ఆటోస్టాండ్ వద్ద ఆయా కాలనీవాసులు రెగ్యులర్‌గా చెత్త పడేస్తున్నట్లుగా గుర్తించారు. బల్దియా ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆ ప్రాంతాల్లోని చెత్తచెదారాన్ని తొలగించి పూర్తిగా శుభ్రం చేశారు. అక్కడ వివిధ రకాల మొక్కలను నాటి ముగ్గులు వేశారు. అక్కడ చెత్త వేయకుండా ఉండాలనే ఉద్దేశంతో చర్యలు చేపట్టినట్లుగా శానిటరీ ఇన్‌స్పెక్టర బైరి శంకర్, పర్యావరణ ఇంజనీర్ అవి కిరణ్ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



నగదు అందజేస్తున్న సభ్యులు

నార్నూర్: కుమురం భీం జిల్లా జైనూర్ మండలంలోని మార్లవాయి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు గుస్సాడి టీం లీడర్ కనక సుదర్శన్ కూతురు కనక అమూల్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. గురువారం జైనూర్ హాస్పిటల్ నుంచి ఆదిలాబాద్ రిమ్స్‌కు అక్కడి నుంచి హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో అభిమన్యు వాట్సాప్ గ్రూప్ సభ్యులకు సమాచారం అందించారు. వారు తక్షణమే స్పందించి రూ. 60 వేలు జమ చేసి, గొండ్వన రాయి సెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్ ఉట్నూర్‌లో అందజేశారు. కార్యక్రమంలో మెస్రం శేఖర్ బాబు, ఆత్రం భుజంగ్ రావు, ఆత్రం సుగుణ, కనక రామారావు, దేవేందర్, కనక వెంకటేశ్, మర్సుకోల తిరుపతి పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన అట్రాసిటీ కమిటీ సభ్యులు



ఎస్పీని సన్మానిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ అట్రాసిటీ కమిటీ సభ్యులు గురువారం పలు అధికారులతో పాటు ఎమ్మెల్యేను కలిశారు. కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, దళిత అభివృద్ధి శాఖ అధికారి సునీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రలను వేర్వేరుగా కలిసి శాలువాతో సన్మానించారు. అధికారులను కలిసిన వారిలో అట్రాసిటీ కమిటీ సభ్యులు అయిండ్ల శశికాంత్, మెస్రం జంగుబాపు, శ్యామలదేవి పుల్లాడి, లక్ష్మీకాంత్, ఉషరాణి, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయినేజీ



జైనథ్ మండల కేంద్రంలో పారిశుద్ధ్యం పడకేసింది. వర్షాకాలం విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మేజర్ గ్రామపంచాయతీ అయినప్పటికీ పారిశుద్ధ్య పనుల్లో మాత్రం పట్టింపు లేనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– జైనథ్

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న చైర్మన్, అధికారులు

బోథ్: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ వారి తల్లి పేరిట మొక్క నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ జలాల్, వ్యవసాయాధికారి రవితేజ, డీసీసీడీ మేనేజర్ శైలజ, సీఈవో గోలి స్వామి, ప్రణీత్ పాల్గొన్నారు.

రేపటి నుంచి అందుబాటులోకి స్విమ్మింగ్ పూల్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో స్విమ్మింగ్ పూల్ శనివారం నుంచి తెరుచుకోనున్నట్లు నిర్వాహకుడు రాష్ట్రపాల్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలతో కలుషిత నీరు చేరడంతో తొలగించడం జరిగిందన్నారు., ఈనెల 5నుంచి స్విమ్మింగ్ పూల్ అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్చోడ: మండలంలోని ఇచ్చోడ, నర్సాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ రాజు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బేల: మండల కేంద్రంతో పాటు చప్రాల, సాంగిడి, సిర్సన్న గ్రామాల శివారుల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏడీఈ శ్రావణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బస్సు చార్జీల పెంపుపై ఖండన

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సు ఛార్జీలు పెంచడాన్ని బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకుడు మజర్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్ అని చెప్పి మగవాళ్లపై వసూళ్లు చేస్తున్నారని విమర్శించారు. బస్‌చార్జీలు పెద్ద మొత్తంలో పెంచి ప్రయాణికుల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. పెంచిన బస్ చార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఎండీఎం అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం కేశవ్ అన్నారు. గురువారం డీఐఈవో జాదవ్ గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తామని చెప్పినా.. ఇంతవరకు ప్రారంభించడం లేదన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల ఫీజులను నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తరుణ్, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సాత్నాల: ఆరోగ్యమే మహాభాగ్యం అని జామ్ని ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్ యాదవ్ అన్నారు. గురువారం ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎండీ ఇక్రమొద్దీన్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ నైతం దేవ్‌భాయ్, పెందూరు మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- భోరజ్ మండలంలోని పిప్పర్ వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి చదువుపై దృష్టి సారిస్తారని అన్నారు. ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ రాకేశ్‌రెడ్డి, రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని కనుగుట్ట జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో , సొనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ×ఆరోగ్య పాఠశాల్ల కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు.

ఆరోగ్య పాఠశాల ప్రారంభం

జైనథ్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం ఆరోగ్య పా ఠశాల ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్ది లాస్మన్న మాట్లాడుతూ.. కలెక్టర్ ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ఏర్పా టు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో అమ్మఆదర్శ పాఠశాల అధ్యక్షుడు వెంకటమ్మ, ఉపాధ్యాయులు రవీందర్, దయానంద్‌రెడ్డి, రమేశ్, కృష్ణవేణి, సుజాత, సునీత పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

నార్నూర్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎంఈవో పవార్ అనిత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎందుకు ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాదక ద్రవ్యాలు తీసుకుంటే జీవితాలు బుగ్గి పాలవుతాయన్నారు. విద్యార్థి దశలో చదువుపై ప్రత్యేక దృష్టి సారిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. పాఠశాల స్థాయిలో క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని సూచించారు. ఆరోగ్య పాఠశాల ద్వారా విద్యార్థులకు మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆమె వెంట ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, లక్ష్మణ్, నిర్మల ఉన్నారు.

గుడిహత్నూర్: ఆరోగ్యంగా ఉన్న విద్యార్థులే చదువుపై మక్కువ చూపిస్తారని మండల వైద్యాధికారి శ్యాంసుందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్యంతో పాటు చదువుపై శ్రద్ధ వహించి తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవిదాస్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు ఇబ్బందులు

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సరైన సౌకర్యాలు లేక ఆదిలాబాద్ పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని టైలర్స్ కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రం ఏర్పాటు అయితే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు ఆశించినప్పటికీ, వారి ఆశలు నెరవేరలేదన్నారు. వీలైనంత త్వరగా వార్డు అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. రోడ్ల నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు, బీజేపీ నాయకులు లాలా మున్నా, ఆకుల ప్రవీణ్, కృష్ణ యాదవ్, శరత్, సూర్య కిరణ్, శివ పాల్గొన్నారు.

పురుగుల అన్నం తినమంటారా?



మాట్లాడుతున్న విద్యార్థులు

బోథ్: ×విద్యార్థులు పురుగుల భోజనం తినాలా? అది ప్రశ్నిస్తే టీసీ ఇస్తామంటారా? అంటూ ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం బోథ్ మండల కేంద్రంలోని ఎస్టీ గిరిజన పాఠశాల, హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్‌లో వడ్డిస్తున్న భోజనంలో పురుగులు ఉన్నాయని, నీళ్ల పప్పు, ఉడకని అన్నం విద్యార్థులకు తినమంటున్నారని అని మండిపడ్డారు. పురుగుల భోజనం గురించి విద్యార్థులను ప్రశ్నిస్తే తమకు టీసీ ఇచ్చేస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మున్సిఫ్, నరేశ్, శ్రీకాంత్, నితీష్ పాల్గొన్నారు.

మాదిగలకు చోటు కల్పించాలి



మాట్లాడుతున్న అరెల్లి మల్లేష్

ఇచ్చోడ: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీలో మాదిగలకు చోటు కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీలో ఐదుగురు సభ్యుల్లో 3 ఎస్టీలకు, 2 ఎస్సీలకు ఇవ్వడంలో అభ్యంతరం లేదన్నారు. ఎస్టీ వర్గంలో లంబాడా సామాజిక వర్గానికి సైతం చోటు కల్పించలేదన్నారు. ఈ విషయంపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బరుకుంట సూభాష్, చిట్టి రవి, జన్నారపు సాయి, కల్లెపెల్లి రాజు, కాశిపాక విష్ణు, నల్ల గంగన్న పాల్గొన్నారు.

నాలుగు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

తలమడుగు: మండలంలోని పల్సి(బి)తండా గ్రామంలో గిరిజన ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 1 తరగతి వరకు 52 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక ఉపాధ్యాయుడు మాత్రమే పాఠాలు బోధిస్తున్నాడు. విద్యార్థులు సంఖ్య అధికంగా ఉండడంతో సరైన విద్య బోధన అందడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఇదే పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా.. ఈ ఏడాది ఒక ఉపాధ్యాయుడు విద్య బోధన చేస్తున్నాడు. ఉపాధ్యాయుడు సెలవు పెడితే ఆ రోజు పాఠశాలకు సెలవు. పాఠశాలకు తరగతి గదులు, ప్రహరీ లేదు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.